# ఐతే.....

కె. సత్యవతి

"అమ్మా!" గట్టిగా అరిచాడు రాఘవ.

"ఏంటమ్మా! జానకమ్మా! నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థమౌతోందా?" విశ్వనాథం అదే స్థాయిలో కేకలేసాడు.

జానకి ఏం మాట్లాడకుండా కూర్చుంది.

"అమ్మా! నా గురించైనాఆలోచించవా? మా అత్తగారు ఏమనుకుంటారో! ఈ వయస్సులో ఏంటమ్మా ఇది. నాకూతురి పెళ్ళి గురించైనా ఆలోచించవా?" లత.

"నాకెంత వయసయిపోయిందని మీరంతా అలా గింజుకుంటున్నారు? ఈ రోజుల్లో అరవైఏళ్ళు అంటే ముసలి వాళ్ళు కానే కార్ధు. అయినా స్వేచ్ఛగా బతకడానికి వయస్సు కొలమానం కాదు కదా" జానకి అంది.

" ఇప్పుడు నీ స్వేచ్ఛకొచ్చిన నష్టమేముంది? మేమెవ్వరం మీతో లేం. మీ ఇద్దరే కదా! నాన్న నిన్నెపుడూ అడ్డుపెట్టడే." రాఘవ ముఖం కందగడ్డలా ఎర్రబడింది.


"ఒరేయ్! రఘు! నువ్వింకేమీ మాట్లాడకు. మీరింతటితో ఈ గొడవ ఆపేయకపోతే నేను చాలా విషయాలు బయట పెట్టాల్సి వస్తుంది. మీ నాన్న గురించి నీకేం తెలుసురా? నన్ను మీరందరు ఇలా నిలదీస్తున్నారే! మీ నాన్న నెందుకు నిలదీయలేక పోయారు?" జానకి ఆవేశంతో వణుకుతూ అంది.

"ఏం పనే ఇది అని నన్నడుగుతున్నావా అన్నయ్యా! నీ బావని ఎపుడైనా అడిగావా? నేను ఏడుస్తూ నీఇంటికొస్తే నన్ను సర్దుకోమని చెప్పి పంపించేసావు. ముప్పై ఏళ్ళు సర్దుకున్నాను. ఇక నా వల్ల కాదు." ఖరాఖండిగా చెప్పింది. జానకి.

"ఏం చేస్తావేంటి? బుద్ధుందా నీకు? మేమంతా తలెత్తుకు తిరగ్గలమా? ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాల్సిందే" విశ్వనాథం రంకెలేసాడు.

"అన్నయ్యా! నువ్విలా మాట్లాడ్డం బావుందా? వదిన చనిపోయిన మూడు నెలలకి రెండో పెళ్ళి చేసుకున్నావ్? మర్చిపోయావా?"

"నువ్వు నేను ఒకటేనా? నేను మగాడిని. భార్య పోతే మరో పెళ్ళి చేసుకోకపోతే నాకెవరు వొండి వారుస్తారు? నీ మొగుడుండగానే ఈ వయస్సులో నువ్వు రెండో పెళ్ళి చేసుకుంటావా? విడాకులు కావాలంటావా? అవ్వ! ఇంతటి ఘోరకలి




ఎపుడైనా విన్నామా?" డెబ్బై ఏళ్ళ వయస్సున్న విశ్వనాథం అరుపులు.

జానకి ఏమీ మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయింది. తన గదిలో కెళ్ళి తలుపులు మూసేసింది.

✿ ✿ ✿

లోపలికెళ్ళిన జానకి మంచానికి అడ్డం పడింది. ఆమె కళ్ళు ధారలు కడుతున్నాయి. ఎన్నెన్ని మాటలంటున్నారు. తన కడుపున పుట్టినవాళ్ళే తనని అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇన్ని సంవత్సరాలు ఎలా భరించింది? తను. ముప్పై ఏళ్ళ జీవితం కళ్ళముందుకొచ్చినట్లయింది. ఇంత సుదీర్ఘ దాంపత్య జీవితంలో తనేం పొందింది? ఏం పోగొట్టుకొంది?

ప్రకాశరావుతో తన పెళ్ళి గుర్తొచ్చింది. తనింకా డిగ్రీ ఫైనలియర్‌లోనే వుంది. మంచి సంబంధం, కుర్రాడు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి అని చెప్పి చదువు మాన్పించి పెళ్ళి చేసేసారు. తను సంతోషంగానే చేసుకుంది. మంచి ఒడ్డూ పొడుగూ, పచ్చటి శరీర ఛాయతో వుండే ప్రకాశరావు ఆమెకు చాలా నచ్చాడు.

మొదటి రాత్రి ఎంతో సంతోషంగా గదిలోకి అడుగు పెట్టిన జానకి ఆనందం వెంటనే ఆవిరై పోయింది. తనకి ఈ పెళ్ళి ఇష్టం లేదని తనకి తన కొలీగ్‌తో ప్రేమ వ్యవహారముందని, ఆమె కులం వేరే అవ్వడం వల్ల, తల్లి చనిపోతానని బెదిరించి బలవంతంగా ఈ పెళ్ళి చేసిందని పిడుగు లాంటి వార్తచెప్పాడు. జానకి నిశ్చేష్టురాలైంది. నోట మాట రాలేదు. అందంగా వుండే ఈ మనిషి వెనుక ఇంత కపటం వుందా? ముందే చెప్పకుండా పెళ్ళి చేసుకుని ఇపుడు చెబితే తనేం చెయ్యాలి?

"నీకు అన్యాయం చెయ్యను. ఆమెను ఒదులుకోలేను. నేను లేకపోతే ఆమె చచ్చిపోతుంది."

"నాకు అన్యాయం చెయ్యడట? ఇది అన్యాయం కాదా? తను లేకపోతే ఆమె చచ్చిపోతుందట? తనేమౌతుంది? తను చదువు మానేసి మరీ పెళ్ళి చేసుకుంది?

ఆ రాత్రి ప్రకాశ్‌రావు సోఫాలో పడుకుని నిద్రపోయాడు. జానకి రాత్రంతా జాగరణ చేసి, తెల్లవారుఝామున నిద్రపోయింది. పొద్దెక్కేవరకు నిద్రలేవలేదు. ఎర్రబడ్డ కళ్ళతో బయట కెళ్ళగానే వరసయ్యే వాళ్ళు వేళాకోళాలు చేస్తుంటే పిచ్చి నవ్వులు నవ్వుతూ తిరిగింది. మూడు రాత్రులు అలాగే గడిచి పోయాయి. తనకి సెలవు అయిపోయిందని చెప్పి ప్రకాశరావు వెళ్ళిపోయాడు. అతను తిరిగి వస్తాడా రాడా? తనని తీసుకెళతాడా? లేడా? ఆవే ఆలోచనలు జానకికి. తల్లితో చెప్పబోతే " ఆ.. పెళ్ళికి ముందు ఎన్నో వుంటాయి. పెళ్ళయ్యాక అన్నీ సర్దుకుంటాయిలేవే." అని కొట్టి పారేసింది.

పదిహేను రోజుల తర్వాత వచ్చాడు ప్రకాశరావు. హైదరాబాద్‌లో తనకు క్వార్టర్ దొరికిందని జానకిని తీసుకెళతానని చెప్పాడు. ఆ రాత్రి జానకితో చెప్పాడు. "పెళ్ళయిన వెంటనే వెళ్ళి పోయినందుకు నీకు కోపం వచ్చిందా? కళ నన్ను బాగా తిట్టింది. కళంటే చెప్పానుగా నా కొలీగ్. తనే వెళ్ళమని,నిన్ను తీసుకు రమ్మని పంపింది."

"అంటే..తన బతుకు ఆమె మీద ఆధారపడి వుందా? ఆమె వెళ్ళమంది కాబట్టి వచ్చాడా? వద్దంటే మానేస్తాడా?"

"మీ అంతట మీరు రాలేదా? ఇన్ని రోజులు ఆమె దగ్గరే ఉన్నారా?"

ప్రకాశరావు ఏమీ మాట్లాడకుండా ఆమెని

దగ్గరికి లాక్కున్నాడు. జానకి ఉక్కిరి బిక్కిరైంది. ఆమె ముఖం వైపైనా చూడకుండా లైటార్పేసాడు. ఆమెకి అతన్ని తోసేయాలని వుంది. తన శక్తి చాలడం లేదు. వాళ్ళ మొదటి రాత్రి చిక్కటి చీకటిలో కనీసం ఒకరి ముఖాలొకరు చూసుకోకుండానే గడిచి పోయింది.

నాలుగు రోజుల తర్వాత అతనితో కలిసి హైదరాబాద్ వెళ్ళిపోయింది. విశాలమైన క్వార్టరు. చుట్టూ తోట. ఆమెకు చాలా నచ్చింది. ఇరుగు పొరుగు బాగానే వున్నారు. ప్రకాశరావు పొద్దున్న వెళ్ళి రాత్రి కొచ్చేవాడు. ఒక్కోసారి చాలా పొద్దు పోయి వచ్చే వాడు. అతను మొదటి రాత్రి చెప్పిన కథ మళ్ళీ ఎపుడూ ప్రస్తావించలేదు. కానీ అతను రాత్రిళ్ళు ఆలస్యంగా వచ్చినపుడు కళావతి ఇంటి నుంచే వచ్చాడని అనుకునేది. అడగడానికి భయపడేది. ఆఫీసులో పని ఎక్కువగా వుందని ఒక రోజు, ఫ్రెండ్‌తో వున్నానని ఒక రోజు చెప్పేవాడు.

ఎపుడూ క్రమం తప్పకుండా వచ్చే మెన్సస్ ఆ నెల రాకపోయేసరికి కంగారు పడింది. ఉద యాలు వికారంగా వుండడం, ఏమీ తినాలనిపించక పోవడంతో ఆమెకి తనికి నెల తప్పిందని అర్ధమైంది. ప్రకాశరావు అత్తగారికి ఉత్తరం రాసాడు. ఆమె వెంటనే బయలుదేరి వచ్చేసింది. జానకి పరిస్థితి చూసి ఆమె కంగారు పడింది. ఏమీ తినక, తిన్నది ఇమడక చిక్కి సగమైంది. ఊరికి తీసుకెళతానని ప్రకాశరావుతో చెపితే సరేనంటూ, టికెట్లు తెప్పిం చాడు. రెండురోజులతర్వాత తల్లితో కలిసి తన ఊరికి వచ్చేసింది జానకి. ప్రకాశరావులో ఏ ఫీలింగ్స్‌ని ఆమె చూడలేదు. ఆమె కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

"ఎందుకే ఆ కన్నీళ్ళు! అల్లుడు గారు వస్తూ వుంటార్లే." అంది.

"ఏమీ రాడమ్మా? హాయిగా తన కొలీగ్‌తో వుంటారు." అంది.

"ఛ...ఏం మాటలే అవి. చెప్పానుగా. పెళ్ళికి ముందు ఎన్నో వుంటాయని. నీతో బాగానే వుంటున్నాడుగా. నేను అడిగితేనే కదా తీసుకెళ్ళమన్నాడు" అంటూ మందలించింది తల్లి.

✿ ✿ ✿

జానకి పుట్టింటికొచ్చి మూడు నెలలవు తోంది. ప్రకాశరావు ఒక్కసారి వచ్చి వెళ్ళాడు. జానకి ఇక్కడే పురుడు పోసుకుంటే మంచిదని చెప్పి వెళ్ళాడు. మొదటి పురుడు ఎలాగూ పుట్టింట్లోనేగా అనుకుంది జానకి తల్లి. జానకికి మాత్రం ఒక్కటే అన్పించింది. ఈ తొమ్మిది నెలలూ ప్రకాశరావుకి తన అడ్డు వుండదు. ఆమెని ఇంటికి కూడా తీసుకొస్తాడేమో! తనెందుకు అతన్ని ఏమీ అడగలేకపోతోంది. అతనూ ఏమీ చెప్పడం లేదు. ఆలోచనల్లో మునిగివున్న జానకి, తమ పొలం చేసే రంగయ్య పిలుపుతో ఉలిక్కి పడింది.

"ఏం జానకమ్మా! బావున్నావా?" అన్నాడు.

అతనితో పాటే నిలబడి వున్న యువకుడ్ని చూపిస్తూ

"నా కొడుకు బాల సుబ్రమణ్యం. మీ కోసం చెరువులో పూసిన కలువపూలు కోసుకొచ్చాడు." అన్నాడు.

బాలసుబ్రమణ్యం తెల్లగా మెరుస్తున్న కలువ పూల గుత్తి తెచ్చి జానకిక్కిచ్చాడు. జానకికి చాలా సంతోషమేసింది. తనకి కలువపూలంటే చాలా ఇష్టం.

"ఏం చేస్తున్నావ్ బాల సుబ్రమణ్యం?" అడిగింది.

"ఇంటర్ ఫెయిల్ అయ్యాను. చదువుమానేసి వ్యవసాయం చేస్తున్నాను" అన్నాడు.

"చదువబ్బలేదు. ఏం చెయ్యాలి? పొలానికి తీసుకు పోతున్నాను. అమ్మగారు లేరా?" రంగయ్య.

"లోపలుంది పిలుస్తాను" అంటూ 'అమ్మా' అని పిలిచింది.

"ఏం రంగయ్యా! బావున్నావా? పొలాలెలా వున్నాయి. బెండకాయ లేసానన్నావ్? బాగా కాసాయా?"

"బాగానే వున్నాం. బెండ ఇవుడే కావుకొంటుంది. గోంగూరకూడా వేసాను. ఈసారొచ్చినపుడు తెంపుకొస్తాను." రంగయ్య.

"నీ కొడుకును పన్లోకి దింపేసావా? చదువు మానేసాడా?"

"చదవని మొండి కేస్తే ఏంచేసేది. అమ్మా! ఎద్దు చచ్చిపోయింది. మరో ఎద్దు కొనుక్కోవాలి. ఏమైనా.."

"అయ్యో! నీ ఎద్దు చచ్చిపోయిందా? మరెలా చేస్తున్నావ్."

" అందుకే కదమ్మా! మీరేమైనా సాయం చేస్తే పంటలో తీసుకుందురుగానీ".

"అయ్యగారితో చెబుతాలే. రెండు రోజుల తర్వాత బాల సుబ్రమణ్యాన్ని పంపు." అంటూ లోపలి కెళ్ళిపోయింది.

కలువపూలగుత్తిని నీళ్ళల్లో పెట్టింది జానకి.

✿ ✿ ✿

తలుపులు దబ దబ బాదుతుంటేజాకి లేచి తలుపు తీసింది. ఎదురుగా ప్రకాశరావు. రిటైర్ అయ్యి ఏడేళ్ళయింది. మంచి ఆరోగ్యంతో, వయసు తక్కువగా కన్పిస్తున్నాడు.

"అన్నయ్యా! ఇపుడు మీ బావనడుగు ఎక్కడి నుండి వస్తున్నాడో. నన్ను దబాయించడం కాదు."

"అవును నేను కళ ఇంటి నుంచే వస్తున్నాను. ఏం చేస్తావ్. ఆడ పుటక పుట్టి సిగ్గు లేకుండా మాట్లాడతున్నావ్." మగాడికి లక్ష సంబంధాలుం టాయి. ఏంటో అనుకుంటున్నావ్. ఈ ఇల్లు దాటా వంటే నీ బతుకు కుక్కలు చింపిన విస్తరే."

"ఇపుడేమైనా వడ్డించిన విస్తరిలాగా వుందా నా బతుకు. మీ ఇష్టం వచ్చినట్లు బతుకుతున్నారే. నన్నెందుకు బతకనివ్వరు. ఈ ఇంట్లో ఏ రోజైనా నా మాట చెల్లిందా? నేను సిగ్గు లేకుండా మాట్లాడ తున్నానా? సిగ్గు, శరం లేకుండా పెళ్ళయ్యాక కూడా వెధవ తిరుగుళ్ళు తిరిగింది నేనా మీరా? మగాడికి




జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 18-11-2008న పెనుగొండలో జరిగిన కథా రచయిత్రి కోపూరి పుష్పాదేవి సన్మాన వేదికపై రమ్యసాహితీ సంస్థ అధ్యక్షులు యమ్.ఆర్.వి సత్యనారాయణమూర్తి, డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, డి. సుబ్బరాయరెడ్డి తదితరులు ఉన్నారు.

"లక్ష సంబంధా లుంటాయా? మరి ఆడవాళ్ళకి ఒక్కటి కూడా వుండ కూడదా?" జానకి కోపంతో అరిచింది.

"అవ్వ! అవ్వ! నీకిదేం పోయే కాలమే. బావా లాభం లేదు. దీనికి పిచ్చి పట్టింది. పిచ్చాసుపత్రిలో పెట్టా ల్సిందే." విశ్వనాధం.

"పిచ్చాసుపత్రిదాకా ఎందుకు? నాలుగు తంతే చాలదా?" ప్రకాశరావు మీద మీద కొస్తుంటే, అతని వెనకే సొంత అన్న.. జానక్కి భయమేసింది. ఇద్దరూ కలిసి కొట్టి చంపేస్తారేమో!




"రాఘవా!" అంటూ గట్టిగా అరిచింది.

కొడుకూ కూతురూ కంగారుగా లోపలి కొచ్చారు.

"నాన్నా! ఏంటిది? అమ్మతో పాటుమీకూ పిచ్చిపట్టిందా?పదండి బయట మాట్లాడు కుందాం?"

"ఒరేయ్! నువ్వూ మగాడివే కదా! నాన్నకు తగ్గ కొడుకువి. నాకు పిచ్చి పట్టిందంటావా? మీ కోసమే కదా నా జీవితం నాశనం చేసుకున్నాను. మీ నాన్న ఏనాడైనా మీ బాగోగులు చూసాడా? మీ ఇద్దరి కోసమే నేను సర్వం త్యాగం చేసాను."ఆమె దు:ఖం తన్నుకొస్తోంది.

లత తల్లి దగ్గరికి వచ్చింది. జానకి కూతురిని పట్టుకొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది. లత కళ్ళల్లో కూడా నీళ్ళొచ్చాయి.

"ఎందుకొచ్చిన గొడవమ్మా! సుఖాన ఉన్న ప్రాణాన్ని దు:ఖాన పెట్టుకుంటావు. నీ నిర్ణయం మార్చుకోమ్మా! నీకు దణ్ణం పెడతాను."

జానకి వెంటనే కళ్ళు తుడుచుకుంది.

"నేను దు:ఖంలోంచి సుఖంలోకి, స్వేచ్ఛలోకి వెళ్ళాలనుకుంటున్నాను. నన్ను ఆపకండి. నాకు విడాకులు కావాలి. ఇవ్వకపోయినా నేను ఇంట్లోంచి వెళ్ళిపోతాను." ఖచ్చితంగా అంది.

ప్రకాశరావు ఆమె మీదకొచ్చి పిడిగుద్దులు కురిపించసాగాడు. లత అతన్ని విడదీసింది. జానకి మంచం మీద పడిపోయింది.

"దొంగ ము... ఎక్కడి కెళ్ళతావ్. వాడి దగ్గరికే కదా? ఆ బాల సుబ్బిగాడ్ని చంపి పాతరేస్తే నీ రోగం కుదురుతుంది."

కోపంతో ఊగిపోతూ అరిచాడు. ప్రకాశ రావు.

బాలసుబ్రమణ్యంపేరు వినగానే జానకిలో కొత్త చైతన్యం వచ్చినట్లయింది.

అలాగే కళ్ళు మూసుకు పడుకుంది. కాసేపు అరిచి అందరూ బయటకెళ్ళి పోయారు.

✿ ✿ ✿

జానకికి బాలు గుర్తొచ్చాడు. సంస్కారం వుట్టి పడే అతని వ్యక్తిత్వం గుర్తొచ్చింది. తనంటే అతనికెంత ప్రేమో తెలుసు. పచ్చటి పల్లెటూళ్ళో ఆరుగాలం కష్టపడే మనిషి. తన కోసం వారం వారం వచ్చేవాడు. కూరగాయలని, కలువపూలని, జున్నని, పాలని ఏదో వంకతో వచ్చేవాడు.తియ్యటికొబ్బరి బొండాలు మోసుకొచ్చేవాడు. మొదటి కాన్పు కొచ్చినపుడు సంవత్సరం పైనే పుట్టింట్లోనే వుండి పోయింది. అపుడే బాలుతో బాగా పరిచయం పెరిగింది. ప్రకాశరావు నెలకోసారి కూడా వచ్చేవాడు కాదు. కానీబాలుమాత్రం వారం వారం ఏదో ఒకటి పట్టుకుని వచ్చేవాడు. రైతు కొడుకు కదా! పైగా మంచి కూరగాయలు, బొండాలు ఊరికినే మోసు కొస్తున్నాడులే అని ఆమె తల్లి పెద్దగా పట్టించుకునేది కాదు.

ఒకసారితేగలు, బుర్ర గుంజు తీసు కొచ్చాడు. నిప్పుల మీద కాల్చిన తేగలు.

"ఒరేయ్! బాలూ! తేగలు భలే కాల్చావు. నువ్వేనా?

"నేనే కాల్చానమ్మా!జానకమ్మకి ఇష్టం కదా."

తనకేమిష్టమో బాలుకి తెలిసినంతగా తన మొగుడికి కూడా తెలీదు. బాలు చూపుల్లో కన్పించే ఆరాధనకి జానకి అపుడపుడూ విచలిత అయ్యేది. అతనికి, తనకి ఏం సంబంధముందని తన కోసం అంత కష్టపడుతున్నాడు. నల్లటి శరీర ఛాయ అయినా ఎంత కళగా వుంటుంది ఆ ముఖం. ఆ కళ్ళు, ఆ చూపులు వెన్నెలంత చల్లగా వుంటాయి.

ఓ రోజు జున్ను పాలతో పాటు తనపెళ్ళి కార్డు కూడా తెచ్చాడు. వచ్చే నెలలో తన పెళ్ళని సిగ్గు పడుతూ చెప్పాడు. అప్పటికి జానకికి ఎనిమిదో నెల నడుస్తోంది. బాగా వొళ్ళు వచ్చేసింది. గర్భం బాగా ఎత్తుగా కన్పిస్తోంది. కుర్చీలోంచి లేచి వచ్చి బాలు ఎదురుగా నిలబడింది.

"పెళ్ళి కూతురిది ఏ ఊరు బాలూ!" అంది.

"మా మేనత్త కూతురే"

"నీ కిష్టమేనా? ఏం పేరు తనది?"

"మంగతాయారు. ఇష్టమా అంటే చిన్నప్పటి నుండి అనుకున్నదే. పెద్దవాళ్ళు నిర్ణయించేసుకున్నాక చేసుకోవాల్సిందే కదా." " అంటే నీకిష్టం లేదా?"

"మీకో మాట చెబుతాను. ఏమీ అను కోరుగా." అతని కళ్ళు మెరుస్తున్నాయి.

"ఏంటది బాలూ! చెప్పు ఏమీ అనుకోనులే."

"ప్రకాశరావుగారు ఏం మనిషండి. భార్య తొలి కాన్పుకి ఇన్ని నెలలు వదిలేసి, ఆయన మాత్రం..."

"ఉద్యోగం కదా!ఎన్ని రోజులు శెలవిస్తారు?"

"మీరలా వదిలేస్తే మీ చేయి దాటి పోతా రండి. నేనిలా చెప్పచ్చో,చెప్పగూడదో నాకు తెలియదు. శెలవు మాత్రం కారణం కాదండి" అన్నాడు.

మొగుడి వ్యవహారం బాలుకి తెలిసిపోయిం దన్నమాట. ఏం మాట్లాడలేక మౌనంగా నిలబడింది.

"మిమ్మల్ని కష్టపెడుతున్న ఆయన మీద నాకు చాలా కోపంగా వుందండి."

"నా గురించి నీకెందుకింత బాధ. నా జీవితం ఏమవుతుందో నాకే తెలియదు."

"మీరెందుకు నిలదీసి అడగరు? మీ గురించి నాకు బాధ వుండకూడదా? నేను మీకేమీ కానా?"

"బాలూ..వచ్చేనెల నీపెళ్ళి. ఏంటీ మాటలు" తెచ్చి పెట్టుకున్న కోపంతో అంది.

"ఈ పెళ్ళి... సర్లేండి. మీకేకష్టమొచ్చినా నన్ను గుర్తు పెట్టుకోండి. మీరెప్పుడు పిలిచినా మీ ముందు వాలతాను."

"అంటే! ఇంక కనబడవా? అప్పగింతలు పెడుతున్నావేంటి?".

"పెళ్ళి హడావుడి, పనులు, తీరిక దొరకడం కష్టం. పొలం పనులు మొదలవుతున్నాయి."

జానకి అసంకల్పితంగా అతని కుడిచేతిని లాక్కుని మణికట్టు మీద ముద్దు పెట్టింది.

"బాలూ!నాకు తెలుసు నువ్వు నా కోసమే వస్తున్నావని,నేను కడుపుతో వున్నానని నాకిష్టమైనవన్నీ తెస్తున్నావని నాకు తెలుసు. నా మొగుడు నిర్లక్ష్యం చేస్తున్నాడనే బాధ నా కంటే నీకే ఎక్కువుంది" అంది.

"అది గుర్తుపెట్టుకోండి. ఈ రోజు మీరిచ్చిన బహుమతి నా జీవితమంతా గుర్తు పెట్టుకుంటాను. వెళ్ళొస్తాను. పెద్దమ్మ వస్తున్నట్టున్నారు" అంటూ వెళ్ళిపోయాడు.

✿ ✿ ✿

జానక్కి ప్రసవం జరిగి ఆడపిల్ల పుట్టింది. ఆమె బాలింతగా వున్నప్పుడే బాలు పెళ్ళయింది. మూడో నెలదాటాక భర్తదగ్గరికి వచ్చేసింది. బాల సుబ్ర హ్మణ్యం మళ్ళీ కలువనే లేదు. చంటి పిల్లలతో చాలా బిజీ బిజీగా వుండేది. జానకికి లతతో తీరికయ్యేది కాదు. అపుడపుడూ బాలు గుర్తొచ్చేవాడు. పుట్టింటి నుంచి ఎవరైనా వస్తే అడగాలనిపించేది. ఏమని అడగడం?

తర్వాత రాఘవ పుట్టడం మరింత బిజీ అయిపోయింది. పిల్లలతోనే జీవితం అయిపోయింది. వాళ్ళ చదువులు, పై చదువులు, ఎమ్సెట్లు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు జానకి జీవితం మొత్తం వాళ్ళే నిండి పోయారు. లత, రాఘవ ఇద్దరూ అమెరికా వెళ్ళిపోయాక గానీ తన జీవితంలో ఎంత ఖాళీ వుందో ఆమెకి అర్థం కాలేదు.

వెనక్కి తిరిగి చూసుకుంటే తనకంటూ మిగిలిన జీవితం లత కడుపులో వున్నపుడు బాలుతో ఏర్పడిన సాన్నిహిత్యమే ఆమెకు కనబడింది. ప్రకాశరావుతో ఆమెకు ఏనాడూ గాఢమైన మానసిక సంబంధం లేదు. సంసారం, పిల్లలు తనని ఈ ఇంటికి కట్టి పడేసాయి. బాలు భార్య మంగ పాము కాటు వల్ల చనిపోయిందని అమ్మ చెప్పినపుడు చాలా బాధ పడింది. వెళ్ళి ఓదార్చాలనిపించింది.వెంటనే వెళ్ళలేకపోయింది గానీ ఆలస్యంగానైనా వెళ్ళి పలక రించినపుడు బాలు తనని చూసి చాలా సంతో షించాడు.

"ఏంటి బాలూ! బావున్నావా? ఎన్నే ళ్ళయ్యింది నిన్ను చూసి

మంగ గురించి విన్నాను.చాలా బాధ పడ్డాను." అంది.

చుట్టూ పొలాలమధ్య వుందా ఇల్లు. మొదటి సారి వచ్చింది.

"ఏ బాగులేండి. అందరూ నన్ను విడిచి పోయారు. అమ్మా, నాన్న, ఆఖరికి మంగ కూడా" అతని గొంతు వొణికింది.

"కూర్చోండి. మొదటి సారి మా ఇంటి కొచ్చారు కాఫీ పెట్టిచ్చే దిక్కు కూడా లేదు. కానీ నేను బాగా చేస్తాను. ఉండండి ఇపుడే వస్తా." అంటూ లోపలికెళ్ళి, రెండు గ్లాసుల్లో కాఫీ తీసుకొచ్చాడు. చిక్కటి కాఫీ. నురగలు కక్కుతోంది.

"కాఫీ చాలా బావుంది."

"భోజనం చేసి వెళ్ళండి. నేను వంట బ్రహ్మాండంగా చేస్తాను".

"ఇంకోసారి వస్తావే నీ చేతి వంట రుచి చూడడానికి. పొలాల మధ్య మీ ఇల్లు చాలా బావుంది. ప్రశాంతంగా వుంది"

"యింట్లో మనుషులెవరూ లేకపోతే ప్రశాంతంగా వుంటుంది". కదండి.

ఆ మాటకి జానకి మనసు చివుక్కుమంది. బాలు వేపు చూసింది. ఆ కళ్ళల్లో అదే ఆరాధన. ఇన్ని సంవత్సరాలైంది. అయినా అదే భావం.

"బాలూ! నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చుగా. ఒక్కడివే ఎంత కాలమిలా?"

"ఇప్పుడు నాకేం కష్టంగా లేదండి. మీ గురించి చెప్పండి. పిల్లాలెలా వున్నారు?"

"పిల్లలిద్దరూ పెళ్ళిళ్ళయి అమెరికా వెళ్ళి పోయారు. మేమిద్దరమే మిగిలాం. ఆయన రిటైర్ అయ్యాడు. నీకు తెలియంది ఏముంది?

"మీరెలా వున్నారు?"

"ఇలా మిగిలాను.నాకంటూ ఏమీలేకుండా" ఆ పచ్చటి పరిసరాల్లో, బాలుకి అంత సమీపంగా వుండి తన విషయాలు పంచుకోవడం జానకికి చాలా సంతోషాన్నిచ్చింది.

"నాకూ ఏమీ మిగలలేదు కదండి. వయస్సు పైబడుతోంది. ఇపుడే తోడు కావాలన్పిస్తుంది."

అతనామాట ఎందుకన్నాడో జానకికి అర్థమై వొళ్ళంతా జలదరించినట్లయింది. తను కూడా పెద్దదవుతోంది. ఆ క్షణంలోనే ఆమె మనస్సులో ఒక బీజం పడింది. క్రమంగా ఆ బీజంమొలకెత్తి, శాఖోప శాఖలుగా విస్తరించి,తన కుటుంబంలో పెను తుఫానుకు తెరతీసింది.

"సరే బాలూ! నేను వెళ్ళొస్తాను. మీ ఇంట్లో ఫోన్ వుందిగా నెంబరు ఇస్తావా? " అంది వెళ్ళడానికి తయారవుతూ.

పేపర్ మీద నంబరు రాసిస్తూ.

"ఫోన్ చేస్తారా?" అన్నాడు.

"తప్పకుండా చేస్తాను. వెళతాను మరి."

అన్న కొడుకు బండి మీద బయలు దేరుతూ ఒకసారి బాలువేపు, ఆ ఇంటి వేపు సుదీర్ఘంగా చూసింది.

✿ ✿ ✿

ఆ తర్వాత చాలా సార్లు ఫోన్ చేసి మాట్లా డింది బాలుతో. భర్త లేని రాత్రిళ్ళే ఎక్కువ ఆమె జీవితంలో, అలా ఒంటరిగా ఉన్నపుడు గంటల తరబడి వాళ్ళ మాటలు సాగేవి. ఇద్దరూ ఒంటరి తనాన్ని మాటల్లో పంచుకునేవారు. అలా మాట్లాడు తూనే వుంటే అమెరికా నుండి కూతురో, కొడుకో ఫోన్ చేస్తే ఎంగేజ్ వస్తే వాళ్ళకి చాలా కోపాలొచ్చి అరిచేవాళ్ళు.

"ఏంటమ్మా! ఫోన్ ఇంత సేపు ఎంగేజ్ వస్తోంది. ఎవరితో మాట్లాడుతున్నావ్" అని ఆరాలు తీసేవాళ్ళు.

"నా ఫ్రెండ్తో మాట్లాడతున్నాలే. ఏంటి సంగతులు?"

"మరీ అంత సేపా?మేం చేస్తామని తెలుసు కదా" విసుగుదల.

ప్రకాశరావు ఇంట్లో వున్నప్పుడు బాలుతో మాట్లాడటానికి వీలయ్యేది కాదు. అతనితో మాట్లాడకపోతే ఎంతో వెలితిగా వుండేది. అతనితో మాట్లాడడమే ఎంతో హాయిగా, తన ఒంటరితనం మర్చిపోయేలా వుంటుంది.

ఓ రోజు సరదాగా అన్నట్టుగా "బాలు మనం పెళ్ళి చేసుకుని వుండుంటే బావుండేది కదా! నా పెళ్ళికి ముందు నువ్వు కనబడి వుంటే... ఆమె వాక్యం పూర్తవ్వనే లేదు.

"ఇపుడు చేసుకోవచ్చుగా."

"ఈ వయస్సులోనా? నా మొగుడిని ఏం చేయను?"

"విడాకులు తీసుకోండి. అతనితో మీరు సుఖపడిందే లేదు. మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను."ఇప్పుడు తను విడాకులు అడిగితే తన మొగుడిస్తారా? తమ చుట్టాలంతా మొఖాన ఊస్తారు. బంధువుల్లో ఇదో పెద్ద ఇష్యూ అవుతుంది. తన మొగుడిని పన్నెత్తి ఒక్క మాట అనని వాళ్ళంతా ఇపుడు తనని నానా మాటలూ అనడానికి సిద్ధమై పోతారు. చావనీయ్! ఇప్పటికైనా తనకంటూ ఓ జీవితం,తన బతుక్కో అర్థం దొరుకుతాయోమో! తన కిష్టమైనట్టు బతకగలుగుతుంది. అసలు తనకింత ధైర్యం ఎక్కడి నుండి వచ్చింది. తను ఇంత కఠినమైన నిర్ణయం ఎలా తీసుకోగలిగింది. తన మనసెందుకు ఇంతగా ఎదురుతిరిగింది?

ఆ రోజు...ప్రకాశరావు దిగాలుగా ఇంటి కొచ్చాడు. ఒంట్లో బాగోలేదు కాబోలు అనుకుంది. ఎప్పుడూ లేంది 'జానకీ' అని తననిచాలా ప్రేమగా పిలిచాడు.

"కళావతికి పెరాలిటిక్ స్ట్రోక్ వచ్చింది. చూసుకోవడానికి ఎవరూ లేరు." అన్నాడు ఉపో ద్ఘాతంగా.

"అయితే.."

"అయితే ఏముంది? హాస్పిటల్లో అడ్మిట్ చేసాను. కోలుకుంటుందని చెప్పారు॥

"ఇవన్నీ నాకెందుకు చెప్పడం."

"నేను హాస్పిటల్లో వుండాలి. ఆ తర్వాత వాళ్ళింట్లో కూడా ఎవరూ లేరు. నేను అక్కడే వుందామనుకుంటున్నా కొంతకాలం."

"నేను బతికుండగానే నన్నొదిలేసి ఆమె దగ్గరుంటారా? నేను ఒప్పుకోను" అంది గట్టిగా.

"నీ అంగీకారం ఎవడడిగాడు. నేను రాత్రికి హాస్పిటల్లోనే వుండాలి.।" అంటూ తన బట్టలు, కావలసిన వస్తువులు సర్దుకోసాగాడు.

"సరే అయితే, మీ దారి మీరు చూసుకున్నారుగా. నేను కూడా నా దారి చూసుకుంటాను. ఇంత కాలం భరించడమే నా తప్పు. నా బతుకు నేను బతుకుతాను."

"ఎక్కడికి పోతావ్? కాళ్ళిరగ్గొడతాను. నోర్మూసుకుని ఇంట్లో పడుండు." అంటూ బ్యాగ్ తీసుకుని వెళ్ళిపోయాడు.

జానకి స్థాణువులానిలబడిపోయింది. ఆమె కోపంతో రగిలిపోయింది. వెంటనే బాలుకి ఫోన్ చేసింది.

"బాలూ! నేను మా ఆయనకి విడాకులు ఇచ్చేద్దామనుకుంటున్నాను."

"ఏమైంది? గొడవ పడ్డారా?" జరిగిందంతా చెప్పింది.

"నేనా నాడే చెప్పాను. మీరు వినలేదు. ఆయన ఇంక ఇంటికి రాడు"

"నేను కూడా ఇంట్లోంచి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను."

"ఎక్కడికి వెళతారు?"

"నీ దగ్గరికే బాలూ! ఈ వయస్సులో ఎంటిది అనుకుంటున్నావా?"

"ఊళ్ళో వాళ్ళు మనల్ని బతకనిస్తారా?"

"ఎటైనా వెళ్ళిపోదాం. నా దగ్గర బోలెడు బంగారం ముంది."

"నా దగ్గరా డబ్బుంది ఫర్వాలేదు. కొంత కాలం హాయిగా వుండొచ్చు.

"నువ్వు నేను ఒకే వయస్సులో వున్నాం. ఎంతో జీవితాన్ని చూసాం. నాకు కావలసింది ఒక తోడు. ప్రేమగా వుండే తోడు. నాకు అంతకన్నా ఏమీ అవసరం లేదు."

"నేను ఏకాకిగాడిని. మీరు నాకు ప్రాణ సమానం. మీరు వస్తానంటే కాదనగలనా? ఎటొచ్చీ చాలా గొడవలౌతాయి. అదే భయం?"

"నేను అన్నింటిని ఎదుర్కోడానికి సిద్ధంగా వున్నాను బాలూ. ఇన్ని సంవత్సరాలు పిల్లల కోసం ఇతణ్ణి భరించాను. అతను నన్ను బెదిరించి తన మొదటి పెళ్ళాం దగ్గరికి వెళ్ళిపోయాడు. అతన్ని ఎవరూ ఏమీ అనరు."

నన్ను దుమ్మెత్తి పొయ్యడానికి ఊరు, ఊరంతా ఏకమౌతుంది. నా పిల్లలు కూడా నన్నే తిడతారు. అయినా సరే బాలూ! నా నిర్ణయం మారదు. నువ్వు బాగా ఆలోచించుకో" అంది.

"నేను సిద్ధమేనండి. నాకు ముందూ వెనకాలా ఎవ్వరూ లేరు. పట్టించుకునే వాళ్ళు లేరు. మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తాను. సరేనా..."

జానకి ఫోన్ పెట్టేసి ఆలోచనలో పడింది. తన మొగుడి పొగరణిచే పద్ధతిలో ఇల్లొదిలి పోవాలి. చెప్పి వెళ్ళాలి. రాత్రి కొడుకు ఫోన్ చేసినపుడు తండ్రి చేసిన పనిని చెప్పింది.

"ఇపుడుకొత్తేముందమ్మా! ఎపుడూ వున్న దేగా?" అన్నాడు తేలికగా.

"ఎపుడూ లేని విషయం ఒకటి చెబుతున్నా విను. నేను మీ నాన్న నుండి విడాకులు తీసుకుందా మనుకుంటున్నాను."

"అమ్మా! ఏంటి నీకేమైనా మతి పోయిందా. నీ వయస్సు ఎంతో గుర్తుండే మాట్లాడుతున్నావా?"

"నాకు అన్నీ తెలుసులేవోయ్. అరవై ఏళ్ళకి అన్నీ ముగిసిపోవాలా? ఏంటి? మీ నాన్నలాంటి వాళ్ళు ఏ వయస్సులోనైనా ఎన్ని సంబంధాలైనా పెట్టు కోవచ్చు. ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకోవచ్చు. నాకిష్టం లేని మొగుడికి నేను విడాకులెందుకు ఇవ్వకూడదు."

"ఏంటమ్మా ఇది. నాన్న పొరబాటు చేస్తే. నువ్వు చేస్తావా?"

"నేను పొరబాటు చెయ్యడం లేదు. పొర బాటును దిద్దుకుంటున్నాను.నేను ఇంతకాలం బతికిన బానిస బతుక్కు ఫుల్‌స్టాప్ పెడుతున్నాను." రాఘవ ఏమీ మాట్లాడలేదు.

"సరే. ఫోన్ పెట్టేస్తున్నాను." ఠక్కున ఫోన్ పెట్టేసింది.

రాఘవ వెంట వెంటనే, లతకి, మేనమామకి ఇంకెవరికో చెప్పడంతో వరుసగా ఫోన్‌లు.

విశ్వనాథం నానా తిట్లూ తిట్టాడు. మా ఇంట చెడబుట్టావన్నాడు. అరవయ్యో ఏట ఈ అప్రాచ్యపుపనికి సిగ్గు లేదా అంటూ కేకలేసాడు. జానకి అన్నకి ధీటుగా సమాధానాలు చెప్పింది. కూతురుకి గట్టిగానే చెప్పింది. ఆ తర్వాత ఫోన్ ఎత్తడం మానేసింది.

✿ ✿ ✿

ప్రకాశరావు కొట్టి బయటకు వెళ్ళిపోయాక జానకి పరిపరి విధాల ఆలోచించింది. తన పక్కనే కూర్చున్న లత చిన్నగా ఏడుస్తోంది.

"మీరు అనవసరంగా వచ్చారు.వెళ్ళిపొండి. నేను కూడా వెళ్ళిపోతున్నాను. మీకు తెలియదు. నేను జీవితంలో ఏం కోల్పో యానో. మీ నాన్న నన్ను ఎప్పుడూ మనిషిగా చూళ్ళేదు. మీ గురించే నేను ఈ ఇంట్లో బానిసలాగా వున్నాను. మీ నాన్నకి నా మీద ఎప్పుడూ ప్రేమ లేదు. ఇంట్లో ఓ పెళ్ళాం వుండాలి. పిల్లల్ని కనాలి. తనకి చాకిరీ చెయ్యాలి. కాబట్టి నేనిక్కడ వున్నాను. అతని మనసు, ప్రేమ అన్నీ ఆవిడ దగ్గరే వున్నాయి. దీన్ని తట్టు కుంటూ బతకడం ఎంత కష్టమో మీకు అర్థం కాదు. నేను నా శేషజీవితాన్నయినా నా కిష్టమొచ్చినట్టు గడపాలనుకుంటున్నాను. మీరు అర్థం చేసుకుంటే చేసుకోండి. లేదంటే మీ ఇష్టం."

లత తల్లిని పట్టుకుని భోరుమని ఏడ్చింది.

రాఘవ ముఖం తిప్పుకున్నాడు.

"అమ్మా! నీ ఇష్టం. నీకు చెప్పగలిగినదాన్ని కాదు. నీ బాధను నేను అర్థం చేసుకోగలను. నాన్న ఇప్పుడు కూడా ఆవిడ దగ్గరికే వెళ్ళాడు. నా మొగుడు కనుక ఇలాంటి పనిచేస్తే నేను నీలాగా భరించలేను. ఎపుడో డైవోర్స్ అయిపోయేది.ఐవిల్ బి విత్ యూ. డోంట్ వర్రీ" అంటూ తల్లిని హత్తుకుంది.

చాలమ్మా ! నువ్వయినా అర్థం చేసు కున్నావ్" అంటూ కళ్ళుతుడుచుకుంది జానకి.

✿ ✿ ✿

రక్షణాధికారి ఎదురుగా కూర్చుని వుంది జానకి. లత ఆమె పక్కనే కూర్చుంది.

మీకు కౌన్సిలింగ్ అవసరమనిపిస్తుంది." రక్షణాధికారి.

"నాకే కౌన్సిలింగ్ అవసరం లేదు. నాకు విడాకులు కావాలి. నా అప్లికేషన్ తీసుకోండి. "అంది జానకి దృఢంగా

"సరే అయితే ఇచ్చి వెళ్ళండి" అంది.

జానకి, లత బయటకొచ్చారు. బయట బాలసుబ్రహ్మణ్యం నిలబడి వున్నాడు.

"అమ్మా! జాగ్రత్త.నాతో మాట్లాడుతుండు. నేను రేపు రాత్రికి వెళ్ళిపోతాను." అంది లత.

"అలాగేనమ్మా! నువ్విపుడు నాకుకూతురివి కాదు తల్లివి" అంటూ లతను వాటేసుకుంది. ఇద్దరికీ కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

తల్లి తను కోరుకున్న తోడుతో కలిసి వెళు తుంటే కన్నీళ్ళ మధ్య చూస్తూ నిలబడింది లత.

## శుభా కాంక్షలు ఇలా....

పుట్టినరోజు, వివాహ, పదవీ విరమణ శుభా కాంక్షలు,ఇతర విషయ సమాచారాలు చినుకులో ప్రకటనల ద్వారా తెలపాలనుకునేవారు ముందుగా ఫోటోతో సహా వివరాలను చినుకు కార్యాలయానికి రూ॥200/-లు ఎం.ఓ ద్వారా పంపండి. ప్రకటన పడిన సంచికను మీతో పాటుగా మీరు కోరిన ఐదుగురికి పోస్టుద్వారా పంపడం జరుగు తుంది.